ప్రజాశక్తి
శనివారం 7 డిసెంబర్ 2024

104 సిబ్బందిపై ఎస్మా దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి -పాలకొండ

104 సేవల్లో ఎస్మా ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. 104 కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రధాన యజమానిగా ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ వీరి సమస్యలను పరిష్కరించక పోగా ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు తలపెట్టిన ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అవుట్ సోర్సింగ్ టీచర్లపై షోకాజ్ అస్త్రం

- భయపెట్టి లొంగదీసుకునే యత్నంలో సర్కారు
- ఆఖరి పోరాటానికి సిద్ధమవుతున్న గురువులు
- మద్దతు పలికిన యుటిఎఫ్, గిరిజన సంఘాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కాలేజీల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. టెన్త్, ఇంటర్ పరీక్షల గడువు సమీపిస్తోంది. దాదాపు నెలరోజులుగా సమ్మెలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులను దారికి తెచ్చుకొనే యత్నంలో ప్రభుత్వం తలమునకలై ఉంది. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో కళాశాలల్లో పని చేస్తున్న సుమారు 560 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమ్మెలో వున్నారు. వీరిలో ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులే ఎక్కువ మంది ఉన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే నియామకమైన ఈ ఉపాధ్యాయులు, అధ్యాపకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుండడంతో వారు సమ్మెబాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం డిఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు. వీరి ఉద్యోగ భద్రత గురించి ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. పైగా వీరి సమ్మెను నీరుగార్చే ప్రయత్నాలు మొదలు పెట్టింది. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులతో గురుకుల పాఠశాలల్లో కళాశాలల్లో విద్యాబోధన చేయించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులు ఎక్కడా అమలైన దాఖలాల్లేవు. దీంతో ప్రభుత్వం మరోసారి గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులను భయపెట్టేందుకు షోకాజ్ నోటీసులనే అస్త్రాన్ని ప్రయోగించింది. సమ్మెలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు మూడు రోజుల్లో విధులకు హాజరు కావాలని, లేకపోతే తొలగిస్తామని హెచ్చరిస్తూ వారికి నోటీసులు జారీ చేసింది. గడచిన 20రోజులుగా పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ ల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు శాంతియుతంగా ఆయా ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట దీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అనేక సార్లు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులకు, అధికారులకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల స్పందన లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు అధ్యాపకులు ప్రత్యామ్నాయ పోరాటాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం తమ పట్ల మొండివైఖరి అవలంభించడమే కాకుండా పోరాటాన్ని అణిచివేసే చర్యలకు దిగుతుండడంతో వారు ఆఖరిపోరాటానికి సిద్ధమవుతున్నారు. చలో ఐటిడిఎ పేరుతో ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

పెరుగుతున్న మద్దతు

దాదాపు నెల రోజులుగా సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోరాటానికి ఉద్యోగ సంఘాల, గిరిజన సంఘాల మద్దతు పెరుగుతోంది. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెను విచ్ఛిన్నం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో వారి ఆఖరిపోరాటానికి యుటిఎఫ్ మద్దతు తెలిపింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు శుక్రవారం ఐటిడిఎ కార్యాలయం వద్ద దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నోటీసులు ఉపసంహరించుకోవాలని, వారి డిమాండ్లు ఆమోదించాలని కోరారు.

నిరసన దీక్షల్లో ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి

ఉద్యోగాలకు ముప్పు లేదు : మంత్రి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ వద్ద తమ సమస్యలు పరిష్కారానికి దీక్షలు చేపడుతున్న గిరిజన సంక్షేమ ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి కలిసి శుక్రవారం శిబిరాన్ని సందర్శించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు ఎటువంటి ఢోకా లేదని మంత్రి స్పష్టం చేశారు. పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులను తొలగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. డీఎస్సీలో నియామకాలు చేపట్టినప్పటికీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగిస్తామని ఆమె చెప్పారు. జీతాల పెంపుపై చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మంత్రికి గిరిజన జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావు, గిరిజన గురుకులం ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 2022 పిఆర్‌సి ప్రకారం జీతాలు పెంచాలని అన్నారు. గురుకులం గిరిజన అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్టీలుగా కన్వర్టింగ్ చేయాలన్నారు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమం ఉపాధ్యాయులు, నాయకులు రామ్మోహన్‌రావు, గణేష్, బాలకృష్ణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ మాట్లాడుతూ జారీ చేసిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని సంఘాలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతు సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

రెవెన్యూ సదస్సులను ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పాలకొండ

సదస్సులకు, కార్యాలయానికి వచ్చే రైతుల భూసమస్యలపై అధికారులు దృష్టి సారించాలని మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. మండలంలోని కొండాపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు (ఆర్ఎస్)ను ఆమె ప్రారంభించారు. "మీ భూమి మీ హక్కు" అన్న నినాదంతో ఈనెల 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ లోగోతో భూమి పట్టా పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. డి పట్టా సమస్యలు వివాదాలకు ప్రధానమైనవని, వీటిని పరిష్కరించడంలో శ్రద్ధ వహించాలని కోరారు. శనివారం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కూర్మసాగరం, జంపరకోట ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 14, 15 ఫైనాన్స్ నిధులు విడుదల చేశామని, వాటి ద్వారా మంచి పనులు చేపట్టవచ్చని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ ప్రతిపాదించిన పనులను మంజూరు చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో తోటపల్లి ఎడమ ప్రధాన కాలువకు రూ.195.34 మంజూరయ్యాయని, గత ఐదేళ్లలో పనులు సక్రమంగా జరగలేదన్నారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో డంపింగ్ యార్డు తదితర సమస్యలను పరిష్కరించాల్సి ఉందని, రెవెన్యూ సదస్సుల్లో అందుతున్న సమస్యలపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను కోరారు.

జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్)లో భూ సమస్యలపై దాదాపు 50 నుంచి 60 శాతం ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. భూమితో ప్రతి ఒక్కరికీ ఇది భావోద్వేగ బంధమన్నారు. జిల్లాలో దాదాపు 965 రెవెన్యూ గ్రామాలుండగా వాటి పరిష్కారానికి సదస్సులు నిర్వహించనున్నామని చెప్పారు. చాలా మంది సాధారణ అగ్రిమెంట్‌ను మాత్రమే కలిగి ఉన్నారని, ఇది చట్టబద్ధంగా అధికారం లేనిదని, భూమిని రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఫారం 8 నోటీసు జారీ చేయకుండా వన్ బి అడంగల్‌పై మార్పులు చేయడం జరగదని స్పష్టం చేశారు. భూ హద్దులపై కూడా సర్వే నివేదిక పొందాలని సూచించారు. సదస్సుల్లో అందజేస్తున్న సేవలన్నీ ఉచితమని ప్రజలకు తెలియజేశారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రతతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సదస్సులో మంత్రి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్, సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు, అర్బన్ స్పెషల్ ఆఫీసర్ సాల్మన్‌రాజు, తహశీల్దార్ బాల మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ కొండబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. అగ్నివీర్ ఉద్యోగ అవకాశాలపై ఎయిర్ ఫోర్స్ సౌజన్యంతో సీతంపేట గురుకులంలో యువతకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ఉద్యోగాలతో పాటు ఎయిర్ ఫోర్స్, నేవీ, ఆర్మీ వంటి రక్షణ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, యువత వాటి పట్ల అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని తద్వారా సంబంధిత కోర్సుల్లో చేరి నైపుణ్యం సాధించాలని సూచించారు. వైద్య, ఇంజనీరింగ్, శాస్త్ర రంగం, సాఫ్ట్వేర్, ఫార్మసీ, రక్షణ రంగం తదితర ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. స్టాఫ్ సెలక్షన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తదితర సంస్థలు పరీక్షలు నిర్వహించి ఉన్నత హోదాల్లో నియామకాలు చేపడతామని తెలిపారు. వాటిలో ప్రతిభ కొలమానంగా ఆకాశమే హద్దుగా అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎయిర్ ఫోర్స్ ప్రతినిధులు లెఫ్టినెంట్ సందీప్ మాట్లాడుతూ ఎయిర్ ఫోర్స్‌లో వైద్యం, ఇంజనీరింగ్, రక్షణ తదితర విభాగాల్లో అద్భుత అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎయిర్ ఫోర్స్ ప్రతినిధులు లెఫ్టినెంట్ సందీప్, ఝూట్, గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ జి కష్ణ మోహన్, ప్రత్యేక అధికారి ఎం డి గాయాజుద్దీన్ పాల్గొన్నారు.

డిటికి సమస్యను విన్నవిస్తున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, వేణు

భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పేదల భూములు అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు తీసుకొని వారికి భూములు అప్పజెప్పాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎన్వై నాయుడు, కె.ఈశ్వరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మోసూరులో రెండు దశాబ్దాల కిందట గ్రామంలో కొంతమంది పేదలకు రెండెకరాల చొప్పున ప్రభుత్వ భూమి డి-పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ భూముల్లో తుప్పలు, డొంకకొట్టి పెద్ద పెద్ద గుమ్ములను సరిచేసి సాగులో ఉన్నటు వంటి భూములను ఆ గ్రామ పెత్తందారులైన మాజీ వైస్ ఎంపిపి, వైసిపి నాయకులు రాజకీయ అండదండలతో పేదలను బెదిరించి భూములను అన్యాక్రాంతం చేశారని అన్నారు. ఆ భూములు కావాలని ముందుకెళ్లిన పేదలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి బెదిరించి చంపుతామని భయపెడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్ని ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని, చట్టపరంగా అన్యాక్రాంతమైన భూములను పేదలకు అప్పగించాలని, బయటకు రావడానికి కూడా భయపెట్టేలా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికిఎంతైనా ఉందని అన్నారు. డి పట్టా భూములను అమ్మడానికి, కొనడానికి లేదని, అలా చేసిన వారికి శిక్షార్హులన్నారు. ఎవరైతే లబ్ధిదారులు ఉన్నారో వారి పేరున వన్ బి, బ్యాంకు లోన్లు కూడా ఉండి సంపూర్ణమైన హక్కులు కలిగి ఉన్నారని, అధికారులు చట్టపరమైన కేసులు పెట్టి ఎవరి భూమి వారికి అప్పగించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందించారు. దీనికి డిటి స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలకు న్యాయం చేస్తామని, కలెక్టర్ స్థాయిలో ఈ సమస్య తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారం చేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణ చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

స్కిల్ హబ్‌లో నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్స్ ద్వారా వివిధ కోర్సుల్లో మూడు నెలలు పాటు నిరుద్యోగ యువకులు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ కింద ఇచ్చిన ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ఎం.ఆర్ నగర్ లో , డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు కోసం - 9177297528 (శ్రీనివాసరావు) నెంబరుకు సంప్రదించవచ్చని అన్నారు., అలాగే సాలూరు నియోజకవర్గం పరిధిలోని గవర్నమెంట్ పీజీ, డిగ్రీ కళాశాలలో, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు కోసం - 7382559022 (త్రినాధ్)ను, పాలకొండ నియోజకవర్గం పరిధిలోని గవర్నమెంట్ ఐటిఐ కాలేజీ సీతంపేటలో, టైలరింగ్ కోర్సు కోసం - 7993795796 (సురేష్)ను, కురుపాం నియోజకవర్గం పరిధిలోని జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల గుమ్మలక్ష్మీపురంలో, రిసెప్షనిస్ట్ కోర్సు కోసం - 6303493720 నెంబరుకు సంప్రదించాలని చెప్పారు.

హోంగార్డులు పోలీసుశాఖకు వెన్నెముక : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

హోంగార్డు పోలీసుశాఖకు వెన్నెముక లాంటివారని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి కొనియాడారు. 62వ హోంగార్డ్సు ఆవిర్భావన దినోత్సవం శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎస్‌పి, ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, అంకిత సురాన, ఆర్మ్ డ్ రిజర్వు డిఎస్‌పి థామస్ రెడ్డి హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పెరేడ్ కమాండర్ రమేష్ ఆర్ ఎస్సై సారధ్యంలో హెూంగార్డులు పెరేడ్ నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ హెూంగార్డ్స్ వ్యవస్థ ఒక సాదారణ సర్వీస్‌లా మొదలై దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అంచెలు అంచెలుగా ఎదిగి హెూంగార్డ్స్ వ్యవస్థ ఇప్పుడు పోలీస్ విభాగంలో వెన్నెముకలా మారింది అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖలో హెూంగార్డ్లు 1/3 వంతు ఉన్నారని, జిల్లాలో హోంగార్డ్సు సిబ్బంది కొరత ఉన్నప్పటికీ త్వరలో ఆ కొరత లేకుండా కషిచేస్తామన్నారు. పలు సందర్భాల్లో నేరాలను కనిపెట్టడం, కేసు విచారణలో అధికారులకు సహకారంగానూ, కొత్తకొత్త సాంకేతిక విభాగాల్లోనూ, ట్రాఫిక్ రెగ్యులేషన్ లో, ఎలక్షన్, పండగ డ్యూటీల్లో వారి సేవలు మరువలేనివి కొనియాడారు. హెూంగార్డ్స్ ఎలావెన్స్‌లు తక్కువ అయినప్పటికీ మన జిల్లాలో కాకుండా ఇతర జిల్లాలో డ్యూటీలు చేస్తూ ముఖ్యంగా ఈ ఇటీవల విజయవాడలో వచ్చిన వరదల్లో కూడా గొప్పగా సేవలు చేశారన్నారు. ప్రభుత్వం హెూం గార్డ్‌లకు రోజుకు రూ.710 చొప్పున నెలకు రెండు రోజులు వేతనంతో కూడిన సెలవులు, మహిళా హెూం గార్డులకు 3 నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తుందన్నారు. అలాగే హెూం గార్డ్ సంక్షేమానికి హెూం గార్డ్స్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాన్ని రూ.50వేల నుంచి రూ.70వేలకు పెంచామన్నారు. అలాగే హెూంగార్డ్స్ సొసైటీలో సభ్యత్వం ఉన్నవారికి మెడికల్ చికిత్సకు రూ.లక్షలు, అలాగే కుమార్తె వివాహనికి రూ.లక్ష రుణాన్ని క్రెడిట్ సొసైటీ ద్వారా ఇస్తున్నామన్నారు. వారి పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్స్ ఇస్తున్నామని, ప్రమాదవశాత్తు సిబ్బంది మరణించిన వారికి రూ.30లక్షలు బీమా సొమ్మును ఈ ప్యాకేజి ద్వారా చెల్లిస్తున్నట్టు తెలిపారు. హెడ్ఆఫీస్ నుంచి ఎక్స్‌గ్రేసియో కింద రూ.5,00,000 కుటుంబ సభ్యులకు చెల్లిస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు సి-కేటగిరి కింద ఉద్యోగం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇంకా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ అధికారులు భవిష్యత్తులో హెూంగార్డ్‌ల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హెూం గార్డ్‌లకు ప్రశంస పత్రాలను అందజేసి పెరేడ్ గ్రౌండ్‌లో శాంతికి చిహ్నంగా, పావురాలను ఎగురవేశారు. కార్యక్రమంలో పలువురు సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్సైలు, హెూంగార్డు కుటుంబాలు పాల్గొన్నారు..

హోంగార్డుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

గుండెపోటుతో హోంగార్డు మృతి

రైజింగ్ డే రోజున అస్తమించిన చిరుద్యోగి

కన్నీరుమున్నీరైన కుటుంబం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ బంగ్లా వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బూరి నారాయణ స్వామి (45)గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. కలెక్టర్ బంగ్లా వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో దగ్గరలో వున్న జిల్లా కేంద్ర ఆస్పత్రికి తోటి సిబ్బంది తీసుకెళ్లారు. అయితే నారాయణ స్వామి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన నారాయణస్వామి వారం రోజుల క్రితమే బల్జిపేట పోలీసు స్టేషన్ నుంచి ఇక్కడికి విధి నిర్వహణ కోసం వచ్చారు. ఆయనకు భార్య శారద, కుమార్తె రక్షిత (13) వున్నారు. తల్లిదండ్రులు సూరపనాయుడు, గున్నమ్మలకు ఆయన పెద్ద కుమారుడు కావడంతో కుటుంబ భారం ఆయనపైనే పడింది హోంగార్డు ఉద్యోగం తప్ప ఏవిధమైన ఆధారమూ లేదు. కుమార్తె రక్షిత ఎనిమిదో తరగతి చదువుతోంది. గ్రామంలో నారాయణ స్వామి కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదు. తమ కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయామని తల్లిదండ్రులు, భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. విధినిర్వహణ విషయంలో ఉన్నతాధికారుల వద్ద మంచి గుర్తింపు పొందిన నారాయణస్వామి మృతి కుటుంబానికి తీరని లోటని గ్రామస్తులు చెబుతున్నారు.

రైజింగ్ డే రోజున

హోంగార్డుల దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి, ఇతర పోలీస్ అధికారుల సమక్షంలో రైజింగ్ డే పెరేడ్ నిర్వహించి హోంగార్డుల సేవలను కొనియాడారు. సరిగ్గా అదే రోజు హోంగార్డు బూరి నారాయణ స్వామి గుండెపోటుతో కన్నుమూయడంతో పోలీసు సిబ్బందిలో తీవ్ర విషాదం నెలకొంది.

స్కూల్ బస్సు బోల్తా ; క్లీనర్ మృతి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

స్కూల్ బస్సు బోల్తాపడిన సంఘటనలో బస్సు క్లీనర్ పెంకి మురళి (25) మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఒక ప్రైవేటు స్కూలు బస్సు విద్యార్థులను తీసుకొని పార్వతీపురం మండలం బాలగోడబకు వెళ్తుండగా, ఆ గ్రామం సమీపానున్న జోగి నాయుడు చెరువు మలుపు వద్ద స్కూల్ బస్సు అదుపుతప్పి పంట పొలాల వద్ద బోల్తా పడింది. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీశారు. అదే గ్రామానికి చెందిన బస్సు క్లీనర్ పెంకి మురళి (25) మృతి చెందాడు., బస్సులో ఉన్న ఇద్దరు విద్యార్థులకు చిన్నపాటి గాయాలయ్యాయి. మిగతా విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎస్ఐ సంతోష్ కుమారి ఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్ల ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా మురళి ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. ఇంకా వివాహం కాలేదు. తమ చేతికి అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరై రోధిస్తున్నారు. గ్రామంలో విషాఛాయలు అలముకున్నాయి.

సంఘటనలో మృతి చెందిన క్లీనర్ మురళి

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -సాలూరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పట్టణంలోని రెల్లివీధిలో వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండలం అధ్యక్షులు ఆముదాల పరమేష్ పాల్గొన్నారు.

సీతానగరం : అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు భారత రాజ్యాంగం నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో జెసి శోభిక, ఐటిడిఎ పిఒ శ్రీవాత్సవ్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పట్టణ ప్రధాన రహదారిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలో వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, పలువురు ఎంపిపి, వైసిపి నాయకులు,కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సాలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బంగారమ్మపేటలో ఆయన విగ్రహానికి మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు, కౌన్సిలర్ లు గొర్లి వెంకటరమణ, సింగారపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : నవభారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పెదబోగిలి సర్పంచి జొన్నాడ తెరేజమ్మ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సీతానగరం వెటర్నరీ హాస్పిటల్ ఏడి దినకుమార్ పాల్గొన్నారు.



సీతానగరంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జెసి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ధాన్యం కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి - వీరఘట్టం

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని యు.వెంకంపేటలో గల రైతు ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా అధికారులతో మాట్లాడారు. రైతు ఉత్పత్తి కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందించాలన్నారు. ధాన్యం ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెట్టుకున్నామని ఇంతవరకు 33 వేలు ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చే ఫిర్యాదులు శత శాతం పరిష్కరమయ్యేలాచూడాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామ్, ఆర్ఐ లక్ష్మినాయుడు, ఎఫ్ వివో సీసీ వై ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

భారత రాజ్యాంగంపై దాడి జరుగుతుందని, ఈ దాడి నుంచి పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వెంకటరమణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా అంబేద్కర్ నిలిచారని సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. మున్సిపల్ కార్మికులకు పనికి భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతుందని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ప్రస్తుత దళితులు, గిరిజనులు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, వారికి రక్షణ కరువైందని అన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి సింహాచలం, నాగమంతం శంకర్రావు, మామిడి శివ, రాజేష్, మల్లేష్, బంగారు రవి, బంగారు రాజేష్, నాగవంతం శివ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వట్టిగడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు సుమారు 1.2 కిలోమీటర్ దూరంలో ఐటిడిఎ పర్యవేక్షణలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5.5 కోట్లతో 2022లో పనులు ప్రారంభించారు. ఈ ఏడాది మే లో మొదటి లేయర్ వేసి ఫైనల్ లేయర్ వేయడంతో పట్టణ ప్రజలతో పాటు మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల గడిచినప్పటికీ గట్టిగా ఉండే బిటి రహదారి నిర్మించడం అభినందనీయమన్నారు.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు ఒకేషనల్ అకౌంటింగ్ ట్యాగ్జేషన్ గ్రూప్ విద్యార్థులకు కాలేజీ ప్రిన్సిపాల్ హరగోపాల్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకును సందర్శించారు. బ్యాంక్ మేనేజర్ లోచర్ల అశోక్ కాలేజీ విద్యార్థులకు బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలు గురించి అవగాహన కల్పించారు. బ్యాంకులో నగదు డిపాజిట్, విత్‌డ్రా చేయడం, ఎటిఎం ఉపయోగించడం, నెఫ్ట, ఆర్‌టిజిఎస్, స్విఫ్ట్ తదితర సేవలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు వారికి ఉన్న సందేహాలు గురించి అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అకౌంటింగ్ ట్యాగ్జేషన్ అధ్యాపకులు వెలమల అప్పారావు, అన్నపు గిరిబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి - భామిని

ఐటిడిఎ ద్వారా ఉచితంగా అందించి చేప పిల్లలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణిగ సర్పంచ్ కొండగొర్రి చంటి అన్నారు. మణిగ, లక్ష్మీపురం పంచాయతీల్లోని 14 చెరువుల్లో 43,800 చేప పిల్లలను శుక్రవారం పంపిణీ చేశారు. చెరువుల్లో చేప పిల్లల పెంపకంపై మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బొడ్డగూడ సర్పంచ్ బిడ్డిక మార్త, బొడ్డగూడ సచివాలయం సిబ్బంది ఉన్నారు.

వాహనచోదకుని ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ నారాయణరావు

వాహనదారులకు ధ్రువపత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గండి రామినాయుడుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా గురువారం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కోటదుర్గమ్మ దర్శనానికి పాలకొండ విచ్చేసిన గండి రామినాయుడుకు శుక్రవారం స్థానిక కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఆయన అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆయనను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వాదాలు అందించారు. అనంతరం అయన మాట్లాడుతూ తూర్పు కాపుల అభ్యున్నతికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. అలాగే తనకు ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్ కు, జిల్లా ఇంచార్జి మంత్రి అచ్చెనాయుడుకు, ఎమ్మెల్యే జయకృష్ణకు ఎంతో రుణపడి ఉంటానని అన్నారు.

కోటదుర్గమ్మవారిని దర్శించుకున్న రామినాయుడు

గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు : మంత్రి

ప్రజాశక్తి - సీతంపేట

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలైన విద్య, వైద్యం, రహదారులు, తాగు, సాగునీరు తప్పనిసరిగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు మాదక ద్రవ్యాల అనర్థాలు యువతకు, విద్యార్థులకు వివరించాలన్నారు. స్థానిక ఐటిడిఎ పరిధిలో ప్రగతిపై ఐటిడిఎ సమావేశ మందిరంలో మంత్రి శుక్రవారం సమీక్షించారు. విద్యార్థుల సంపూర్ణ ఎదుగుదలకు విద్య దోహదపడాలన్నారు. వసతి గృహాల్లో భోజనం చక్కగా ఉండాలని,కాస్మోటిక్స్ విద్యార్థులకు నేరుగా ఇవ్వాలని, దుప్పటి, కంచం, గ్లాసు, పెట్టె అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల ఫోన్ల వినియోగంపై దృష్టి సారించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగంపై పర్యవేక్షించాలన్నారు. మగ పిల్లలకు మంచి నైతిక విలువలు నేర్పాలని సూచించారు. వసతి గహాలు, పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో 2 వేల రహదారులు నిర్మించేందుకు రూ.2,500 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని, ప్రతి ప్రాంతంలో రహదారులు వేయాలని చెప్పారు. ప్రతి వసతి గృహానికి ఎఎన్ఎంలను త్వరలో నియమిస్తామని, నాన్ టీచింగ్ సిబ్బందిని కూడా నియమించనున్నామని తెలిపారు. అత్యవసర పనులను గుర్తించి వాటికి అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారి రమాదేవిని ఆదేశించారు. తాగునీరు లేని గ్రామాలు ఉండరాదనిస్పష్టం చేశారు. వి డి వి కెలను బలోపేతం చేయాలన్నారు. ఆర్ఒఎఫ్ఆర్ ప్రాంతాల్లో రహదారులు వేసేందుకు అటవీ శాఖతో సమన్వయం చేయాలని సూచించారు. గిరిజనులకు ట్రైకార్ రుణాలు మంజూరు చేస్తామనితెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులకు గురికారదని ఆమె అన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, సాగు నీరు, తాగునీరు, రహదారులు అవసరమని, వాటిపై దష్టి సారించాలని స్పష్టం చేశారు. యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తున్నామని, డిఎస్సి కోచింగ్ కు దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సీతంపేట ఏరియా ఆసుపత్రిలో అనస్థీషియా అవసరం ఉందన్నారు. గిరిశిఖర గ్రామాలకు రక్షణ గోడలు అవసరమని చెప్పారు. ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు దత్తత అధికారిని నియమించామని, ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. ఆర్ఒ ప్లాంట్లను ఏడాది పాటు నిర్వహణకు అప్పగిస్తున్నామని చెప్పారు. గ్రంథాలయాలు ఏర్పాటు చేశామని, ఆశ్రమ పాఠశాలల్లో పామాయిల్ వినియోగం నిషేధించామని చెప్పారు. భామిని ఏకలవ్య మోడల్ పాఠశాలకు ప్రహరీకి ప్రతిపాదన చేశామని చెప్పారు. నాన్ టీచింగ్ సిబ్బంది సమస్య ఉందని ఆయన చెప్పారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ జి.చినబాబు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, గిరిజన సంక్షేమశాఖ డిడి ఎం.అన్నాదొర ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి

జన జాతీయ గౌరవ దివస్ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులను రాష్ట్ర మంత్రి జి.సంధ్యారాణి అభినందించారు. ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎటిడబ్ల్యుఒ కె.సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం నాగావళి నది ఆవల ఉన్న కెమిశిల ఆశ్రమ పాఠశాల, పలు జిపిఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో ఉన్న స్టాక్ రికార్డులను మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అలాగే నేడు జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేసేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని అన్నారు. పిల్లలకు పెట్టే భోజనాన్ని రుచికరంగా ఉంటూ నాణ్యతతో పిల్లలకు పెట్టాలని అలాంటప్పుడే వారికి పోస్ట్‌కు ఆహారం అందుతుందన్నారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని అందిస్తుందన్నారు. కాబట్టి వార్డెన్లు తప్పనిసరిగా బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు మంచి భోజనాన్ని అందించాలని కోరారు. అనంతరం బంధు, తమ్మన్నవలస జిపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆరా తీయగా పలువురు ఉపాధ్యాయులు వ్యక్తిగత కారణంగా సెలవు పెట్టడంపై అక్కడ పాఠశాలలో ఉపాధ్యాయులెవరూ లేకపోవడంపై ఆరా తీశారు. ఇలా ఒకేసారి అన్ని పాఠశాల ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై అలా అన్ని పాఠశాలలకు ఒకేసారి ఉపాధ్యాయులకు సెలవిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

విడివికెలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో గల వన్ ధన్ వికాస కేంద్రాలను బలోపేతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ వై. సత్యం నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిసిలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏడు వన్ దన్ వికాస కేంద్రాల ద్వారా గిరిజన మహిళకు జీవనోపాధి కోసం శిక్షణలు ఇప్పించాలని కోరారు. అలాగే మహిళలు సంఘాలు తీసుకొన్న అప్పులు కచ్చితంగా జీవనోపాధి కోసం వినియోగించాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ ఎపిఎం శివిన్నాయుడు, సిసి లు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంలోని ఒట్టిగడ్డ వద్ద శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ ఘన స్వాగతం పలికారు. శుక్రవారం పాలకొండ, సీతంపేట మండలాల్లో పర్యటన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వీరఘట్టంలో ఆమెకు సాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆర్.రత్నాకర్‌రావు, కె.కుమారస్వామి, లింగాల రాజరత్నం, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు, ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్లు సకాలంలో చెల్లించాలని ఆ సంస్థ ఉద్యోగుల రాష్ట్ర కోశాధికారి బబ్బురు గణేష్ బాబు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి బుర్రి కుమార రాజాను కలిసి జీతాలు, పెన్షన్ల కోసం వినతి పత్రం ఇచ్చారు. జీతాలు, పెన్షన్‌లు ఇవ్వాలంటే అదనపు గ్రాంట్ ఇస్తేనే అవుతుందని ప్రజల నుంచి వసూలు చేస్తున్న సెస్ బకాయిలు వసూలు చేస్తేనే గానీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్ సరిపోకపోవడంతో అదనపు గ్రాంట్ ఇస్తేనే గానీ ఉద్యోగుల జీతావుతాయి . కార్యక్రమంలో గ్రేడ్ 1 గ్రంధాలయ అధికారి వి.వి.జి.శంకర రావు కూడా వున్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ ఇంజినీరింగ్ సహాయకులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిబద్ధత కలిగి సర్వే నిర్వహించాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - సీతానగరం

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మండలంలోని రేగటివలసలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ వివాదాలను తగ్గించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. గ్రామ, మండల స్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి 22ఎ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ సదస్సుల్లో అధికారులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. భూసమస్యల పరిష్కారానికి ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆక్రమణల్లో భూములు కోల్పోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ న్యాయం చేస్తుందని భరోసా కల్పించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ వివాదాల ఉంటే దరఖాస్తు చేసుకుంటే సమస్యను పరిష్కారించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. మండలంలోని మూలిగూడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వారి భూసమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, మండల స్థాయి అధికారులు, సర్పంచ్, విఆర్ఒలు, కార్యదర్శులు, టిడిపి నాయకులు లక్ష్మణరావు, ధర్మారావు, దాసు, సీతారాం, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : భూ సమస్యలు, వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశామని మండల రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి ఎ.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కెమిశీల, గుణదతీలేసు పంచాయతీల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ భూ సమస్యలపై వినతులు స్వీకరించి వారికి సమస్యపై తెలియజేసేందుకు రసీదును అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివయ్య, ఆర్ఐ శంకర్రావు, రీ సర్వే డిటి, విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.**భామిని** : మండలంలోని పాలవలస, మనుమకొండ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ అప్పారావు మాట్లాడుతూ ఈ సదస్సులో పాలవలస నుండి 31, మనుమకొండ పంచాయతీ నుంచి 14 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజేశ్వరరావు, డిటి రమేష్ కుమార్, ఆర్ఐ కె.కృష్ణారావు, స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని అన్నంరాజువలస, మామిడిపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ ఈరెండు గ్రామాల నుంచి 24 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వై సత్యంనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ రంగారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు లేదు... అయినా పన్నులు చెల్లించాలట!

రెవెన్యూ సదస్సులో రైతులు

వీరఘట్టం : తమ గ్రామానికి సాగు నీరు రాకపోయినా పన్నులు మాత్రం చెల్లించాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారని మండలంలోని నడుకూరుకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతు సదస్సు కార్యక్రమం నిర్వహించారు. అలాగే శ్మశానవాటికకు రహదారి కల్పించాలని రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా 1100 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మనాయుడు, ఆర్ఎస్ డిటి జి.ప్రసాద్‌రావు, విఆర్ఒ సింహాచలం, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌కు సిద్ధం

ప్రజాశక్తి - వీరఘట్టం

పేరెంట్స్‌డేకు ముస్తాబైన పాఠశాల

మండలంలో ఈనెల7న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు శుక్రవారం పాఠశాలలను సిద్ధం చేస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధాన ద్వారం నుంచి ఇరువైపులా మామిడి కొమ్మలతో తోరణాలు ఏర్పాటు చేయడంతో పాటు అక్కడక్కడ అరటి మొక్కలు కూడా కడుతున్నారు. తల్లిదండ్రులు పాఠశాలకు వస్తున్నందున వారికి స్వాగతం పలికేందుకు పాఠశాల యాజమాన్యం అనేక ఏర్పాట్లు చేస్తుంది.

కొమరాడ : విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంటు టీచర్ సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ జె.నారాయణ స్వామి అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విద్యార్థులు కందుతున్న విద్యా బోధనలు, సౌకర్యాలు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో వివరించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సమావేశం చేపడుతోందన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సీతానగరం : టీచర్స్, పేరెంట్స్ మీటింగును విజయవంతం చేయాలని ఎంఇఒ సూర్యదేవుడు కోరారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కస్తూరుబా గాంధీ పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ ఈనెల 7న జరుగు మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్" మీటింగు ను విజయవంతం చేయాలన్నారు. ఈ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగునకు పండగ వాతావరణంలా నిర్వహించాలని బూర్జ జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయచంద్ర్ అతిథిగా ఎమ్మెల్యే పాల్గొంటారని ఆమె తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాలు వేసి జీవామృతాలు ఉపయోగించుకొని, పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగడానికి పంట కోత ప్రయోగం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని జీవ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.ప్రబోద్ అన్నారు. మండలంలోని బుడ్డెంఖర్జలో జీవ రైతు, జీవ ప్రాజెక్ట్ పర్యవేక్షణ కమిటీ సభ్యులు పేకాపు మురళి పొలంలో శ్రీవరిలో పంట కోత ప్రయోగ కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో మండలంలోని 12గ్రామాల్లో 150 మంది రైతులతో జీవ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండిస్తున్నారని అన్నారు. వ్యవసాయ కార్యక్రమాలతో పాటు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలైన చేపలు, కోళ్లు, మేకలు, గొర్రెలు పెంపకంపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. మండలంలోని 12 గ్రామాల్లోని ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెంచుకొలా ప్రతిరోజు పంటలు పండేలా, ఆదాయం వచ్చేలా ఒక ప్రణాళిక బద్ధంగా పంటలు పండించుకోవడం వల్ల ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాలు వేసి జీవామృతాలు ఉపయోగించుకొని, పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగడానికి ఈ పంటకోత ప్రయోగం ఒక నిదర్శనంగా కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ రిసోర్స్ పర్సన్స్ పి.గీత, వై.యశోద, కోఆర్డినేటర్ జి.మురళీమోహన్, రైతులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రత్యేక కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డినేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు చేయించుకున్న 30 మందికి దృష్టి పరీక్షలు నిర్వహించామని, కంటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించి, ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర రజని,సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవ తప్పిదం.. మనుగడకు ప్రమాదం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సకల జీవరాసులు మనుగడకు నేల ప్రధానమని, ఆహారం, ఆవాసం అందించేది ఆ నేలతల్లి, మానవ తప్పిదం వల్ల నేడు అది తీవ్ర క్షీణతకు గురవుతుందని రీజనల్ తిమోటిక్ లీడ్ కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఐదురోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ రసానికి ఎరువులు- పురుగు మందులు వాడటం వల్ల భూమి నిస్సారమైపోయి రైతులకు మేలు చేసే రైతు మిత్రులు, మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశించి పోవడంతో రైతులకు పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోవాల్సిన వస్తుందన్నారు. జీవరాసులు మనుగడకు, భూమి సారవంతానికి ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల వలే పనిచేసి రైతులకు అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలు వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు ఎన్ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, పి.దేవీప్రసాద్, ఆర్.శ్రీను, మాస్టర్ ట్రైనీలు, మండల ఇన్‌ఛార్జులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎంపిడిఒ సాల్మన్ రాజుకు శుక్రవారం వినతి అందించారు. ప్రతిరోజు గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించడం ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచుతున్న తమకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం కూడా లేకపోవడం దారుణమన్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలందక పండగ పూట కూడా పస్తులు ఉండాల్సి వస్తుందని అన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ, గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గోతుల్లేని రహదారులే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో గోతుల్లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపిందని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. మున్సిపాలిటీలో గల జగన్నాధపురంలో ఉండే 30వ వార్డులో ఏర్పడిన గోతులకు మరమ్మతు పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా సుందర పార్వతీపురం తయారు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. ముందుగా ప్రజలకు గోతులు లేని రహదారులు తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కాలనీలో ఉన్న పాత్రని కోనేరును ఎమ్మెల్యే పరిశీలించారు. ఎంతో చరిత్ర గల ఈ కోనేరుకు మరమ్మతులు చేపట్టి వినియోగానికి వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ శ్రీనివాసరాజు, అధికారులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై క్షేత్ర సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని బియ్యాలవలస పంచాయతీలో గల దురిబిలి, సూర్యనగర్‌కు చెందిన 30 మంది గిరిజన రైతులకు కూరగాయాల సాగు, అధునాతన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం ఉద్యానవన శాఖాధికారి గిరిజ అవగాహన కల్పించారు. అనంతరం మన్యం ప్రగతి, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు ఆధ్వర్యంలో ఈ రైతులందరికీ జియ్యమ్మవలస మండలంలో పరజపాడు, సింగన పురంలో రైతులు సాగు చేసిన టమాటా, వంగ, కాకర, క్యాబేజీ వంటి పంటల క్షేత్రస్థాయి ప్రదర్శన చేసి సాగు, సాంకేతికపరమైన పరిజ్ఞా నంపై అవగాహన కల్పించి, అధిక ఆదాయం పొందవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఉద్యాన శాఖ సిబ్బంది చందు, ఆదర్శ రైతు పరమేష్‌నాయుడు పాల్గొన్నారు.

విశ్రాంత విఆర్‌ఒను పరామర్శించిన రాజన్నదొర

సాలూరు : రిటైర్డ్ విఆర్ఒ నాగరాజును శుక్రవారం బంగారమ్మపేటలో మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పరామర్శించారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆర్థికంగా ఏమైనా సహాయం కావాలంటే చేస్తానని చెప్పారు.